

# లేఖాయణం

## ఉమ యేలూరి



*మనిషి మనసులోని భావాలకి ప్రతి రూపం, మనసులోని మాటలకి మరోరూపం ఉత్తరాలు. కార్డు, కవరు, ఎయిర్ మెయిల్, ఇ-మెయిల్, ఎస్.ఎం.ఎస్..ఎన్ని రూపాలు మార్చుకున్నా మనిషి ఎదురుగా చెప్పలేని భావాలకి అక్షర రూపం కల్పించడం ఒక కళ..! నెలనెలకీ కొన్ని ఉత్తరాల పరంపరని ఈ నెల నుంచీ ఈ శీర్షికలో మీరు చదువుతారు. వ్రాసేది, అందుకునేది ఎవరైనా కావొచ్చు.. అమ్మా, నాన్న, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, వదినా, మరదలు, బావా, నేస్తం, అనామిక, ప్రేయసి... ఎవరైనా.. ఒక్కో ఉత్తరంలో ఎన్నో భావాలు..కనిపించని కథలు, వినిపించని మౌన రాగాలు..! రచయిత్రి ఉమ గారు, 'భావన' కలం పేరుతో* **http://kristnapaksham.blogspot.com/** *బ్లాగుని కూడా వ్రాస్తున్నారు.*

### పాత తోటల పాట కొత్త చిగురోకటి పలకరించిన వేళ....

**నువ్వు తలపుకొస్తే** నిద్ర దరికే రాదు.... నిద్ర దరికొస్తే మాత్రం పోటీగా కలలతో కలవర పరచటానికి పరుగెత్తుకుని వచ్చేస్తావు నీకిది న్యాయమా నల్ల పిల్లా.... విశ్రాంతి తీసుకో అంటావు అమాయకంగా కళ్ళార్పుతూ....నీ మాటను జవదాటగలవాడా ఈ సత్యాపతి అని విశ్రాంతి తీసుకుందామనుకుంటే నీవూపిరి వెచ్చగా బుగ్గల మీద, నీ చేతిలో ఈకేమో చెవిలో గిలిగిలి పెట్టేస్తుంటే పెద్దగా నవ్వుతూ లేచేను............ దొంగ దొరికిందని చెయ్యిపట్టుకోవటం కోసం చాపిన చేతిని పడమటి దిక్కునుంచి పాకి వస్తున్న పువ్వుల పరిమళం తాకి పరామర్శిస్తే.... బుగ్గ మీద చిరుగాలి నీ పిచ్చితనమే కాని ఆమె ఏది...... ఇక నీ దగ్గరకు రానివ్వనంత దూరం పంపేసేవుగా అని చిటిక వేసి చెప్పి వెళ్ళి పోయింది.

చిరు వెలుగులకు, మత్తిల్లిన చీకటి తెరలకు వారధిగా ఎక్కడో అప్పుడే కోడి కూస్తోంది. ఇక ఈ రోజుకు నిద్ర చాలులే అని మన ఇంటి వెనుక వేప చెట్టు పూత పలకరిస్తూ, ఏది తువ్వాయితో పాటుగా పరుగులు తీస్తూ కనపడేదిగా ఇక్కడే, ఎక్కడ నీ గుండె సవ్వడి వినపడటం లేదు అంటోంది ఏమి చెప్పను..... నా వెర్రి తనం వేయి పడగలై నన్నే కాటేసి నాకిచ్చిన శిక్ష ఈ ఒంటరి తనమనా..... ఇక ఎప్పటికి కలవని రహదారుల వెంట పరుగులెత్తే అడుగుల సవ్వడి క్షణక్షణానికి దూరమే అవుతుంది కాని కలిసి సాగే పదాన్ని కర్కశంగా విడగొట్టిన నా మదికి, ఈ తోటకు ఎప్పటికి రాదు అనా..!? ఈ పొద్దుటే ఇలా నిన్ను మది పలవరించటంతో మొదలయ్యిన రోజు ఇంకెన్ని మంచి తలపులను తీసుకు రానుందో కదా!

అమ్మమ్మ వాళ్ళ తరమే హాయి అనుకుంటా, ఇన్ని సంఘర్షణలు వుండేవి కావు అందినదానితో జీవితాన్ని అనుసంధానించుకుని తృప్తిగా బతికే వారేమో! ఏమోలే వాళ్ళ మనసుల్లో ఏమి వుండేదో వయసులో వున్నప్పుడు మనకు తెలియవు కదా. మన తరువాతి తరాలకు మనం కూడా, బోసి నవ్వులతో మీకులా కాదు మేము, హాయిగా వుండే వాళ్ళం అని చెపుతామేమో. నేను నేను అనే లాజిక్

ఎక్కువ అయ్యే కొద్ది మనం అనే  అనుబంధానికి దూరమవుతున్నామా? అసలు ఏ మనిషికైనా ఆనందంగా వుండటానికి కావలసిన మూల సూత్రమేమిటో ఆర్కిమెడీస్ సూత్రాలకు మల్లే వాటిని కూడా చిన్నప్పుడే పుస్తకాలలో పాఠ్యాంశాలుగా పెట్టి చదివించి బుర్రలోకి ఎక్కిస్తే ఐనా అందరికి అర్ధం అవుతుందేమో.

ఎందుకు నీ వెర్రితనానికి అందరికి కలిపి అంట గడతావు? నీ సంగతి చూసుకో ముందు తరువాత అందరి గురించి ఆలోచిద్దువు అంటావా!? అనవు నువ్వు.! నువ్వు మాట్లాడవు చాలాసార్లు కళ్ళే మాట్లాడతాయి. నీ కళ్ళు చెప్పిన సంగతులను అన్వయిస్తే.!? ఊహూ అన్వయించగల శక్తే నాకు వుంటే ఎన్నో కావ్యాలను ఎన్నో జీవిత పాఠాలను రాయగలిగే వాడిని. ఇలా అశక్తుడినై పూర్తిగా వోడి పోయి ఎక్కడో పలికే నీ గుండె చప్పుడితో శృతి కలపాలని ఆశ తో పిచ్చి పదాలను కూర్చి లేఖ చేస్తానా!?

ఇలా సాగే నా ఆలోచనల తీరుకు నాకే వెర్రి లా అనిపిస్తుంది ఒక్కోసారి. అంటే, చందు "వో నీకు ఇప్పుడు అర్ధం అయ్యిందా నాకు ఎప్పుడు అనుమానమే రా, ఎందుకు కలిసేవో తెలియని ఒక విచిత్ర బంధంను ఇలా తలచి వగచే నీ మతి చలనం మీద" అన్నాడు, ఎంత సేపో నవ్వేను చందు మాటలకు. నిజమే జీవితంలో ఒక అద్భుతమైన ప్రేమ తటస్థించక పోతే ఎవరికైనా ఎంత చెప్పినా ప్రేమ గొప్ప తనం అర్ధం కాదేమో! ఆ మాట అంటే మొన్న రాత్రి జరిగిన చర్చలలో శ్రీధర్ వొప్పుకోలేదు. ఏ బంధానికైనా దాని గొప్పతనం అది నువ్వు కల్పించుకున్న విలువను బట్టీ వుంటుంది. దానంతటకై ఒక విలువ అంటూ దేనికి ప్రత్యేకంగా వుండదు.  ఏమో ఇంకో అద్భుత ప్రేమ నీ కోసం ఎదురు చూస్తోందేమో, ఒక ప్రేమ కాని, స్నేహం కాని లేదా ఒక పరిచయం కాని అద్భుతమని ఎలా తోస్తుంది చెప్పమని అడిగేరు. కావాలంటే పుట్టుక నుంచి జరిగిన ప్రతి సంఘటనను విశ్లేషించి చెప్పమని అడిగేరు. మొన్న రాత్రి అసలు ఆ చర్చే బలే తమాషాగా మొదలయ్యింది. నువ్వు వుంటే అరుగుమీద చలిగాలికి కొంగు లాగి బిగించి మోకాళ్ళను కడుపులోకి లాక్కుని కూర్చుని వూయలలూగుతూ నవ్వుకుంటూ వినే దానివేమో.

ఎలా చెప్పాలో అర్ధం కాలేదు పద్యాలను యతి ప్రాసలతో గణ విభజనలతో మాత్రలతో లెక్క కట్టినట్లు, అనుభవాల మాలికను విడగొట్టి లెక్క చూసి ఏది ఆగినా జీవితమాగదు కాబట్టీ గతంను గతించిన కాలజతిలో కలిపి నూతన ప్రవాహ కేళికై వేచి చూడు అదే జీవితం అంటే నేను ఒప్పుకోలేదు.. వీటన్నిటినీ మించి ఏదో వుంటుంది, అది ఏదో...... ఏమని చెప్పాలో ఎలా నిర్వచించాలో తెలియటం లేదు. మనసు కూడా మాట విననని ఎన్నెన్నో జ్ఞాపకాల గుత్తులను విరగ పూయించి చెపుతోంది.

ఇన్నాళ్ళ తరువాత... ఊహూ....ఇన్నేళ్ళ తరువాత కూడా అదమలేని నా గుండెల విలాపగీతం, స్వయంకృతాపరాధ రాగంలో.... వొంటరైన జంట చకోర తాళంలో నిను తలుస్తుంటే.... నీవెక్కడున్నా ఇది నినుచేరాలని... నీ తలపుల చాటున మిగిలిన నా జీవన శ్వాసను పలకరించాలని ఆశిస్తూ.......

***నీ వాడు***

***ప్రియ నేస్తం,***

నీ రూపు నీ మాట నీ అడుగు గత జన్మలోని బంధమల్లే మసకేసి పోతోంది కంటి చెలమల మధ్య కనుపాపలో. జారినివ్వు మిత్రమా కిందకు జారిన ప్రతి చుక్క నీకిచ్చే నీరాజనమై నా గుండెలోని నీ జ్ఞాపకానికి హారతులెత్తుతోంది..

రోజు రోజు కొక రాగం పలకరించే ఈ ఉదయం. ఉదయానికే ఒక హాసం ప్రకృతి పరిచిన పూల వనం. వనాల విరిసిన సంగీతం విరించి ఇచ్చిన అదనపు బహుమానం. బహుమానాలన్ని ప్రోది చేసి గుచ్చి ఇచ్చిన సూత్రం ఈ ఉదయాన నా కృష్ణయ్య మధుర దరహాసపు ఆనవాలు నిచ్చే అక్షరాల భావం. భావాలన్నీ కలిసి విరిసిన సుమధుర సువాసనల సరాగం పంచుతూ ఈ రోజు పొద్దుటే నీ

తలపాకటి వాలి వడలి పోయిన తోటలోకి నవవసంతం కాంక్షించే రామచిలుకలా వాలితే అది అనునిత్యం సాగే నీ నామ జపమనుకున్నా కాని కాదు అది నువ్వు నాకొరకు పంపిన జ్ఞాపికల జలధారల జలదరింపు అని ఇప్పుడే ఈ క్షణానే వచ్చిన నీ జాబు చెప్పింది..

ఎన్నాళ్ళకు ఎన్నేళ్ళకు ఒక మాట, ఒక తలపు., ఒక పిలుపు మనమున్న ప్రేమ రాజ్యం నుంచి నాకొరకొచ్చింది! నిన్న మొన్నటి విషయమల్లే గతించిన జ్ఞాపకమొకటి సజీవమై ఎదుట నిలిచిన క్షణం, ఎదురు చూసిన జన్మజన్మల బంధం ఎదుట నిలిచి పలకరించిన క్షణం. ప్రతి క్షణమొక యుగమైన ఈ కాలమంతా ఒక్క సారి ఘనీభవించి ఎక్కడ మన కథ ఆగిందో అక్కడే తిరిగి కాలం మొదలైనట్లనిపించింది.

ప్రేమ అన్న పదమొక సుస్వర నాదమై నా జీవితాన్ని వెలిగించిన రోజులను నేను మరవగలనా!? మన ప్రేమ ఎంత నిజమో మన అనుబంధమెంత సత్యమో  పైన నీ అపనమ్మకపు నీలి నీడల మేఘగర్జన అంతే నిజం. అపస్వరాల సాగిన మన ప్రణయ రాగం ఒక్క సారి గుక్కపట్టి ఆగిపోవటం అంతే సత్యం. ఒక్క సారైనా ఆగి ఆలోచించినా మన అనుబంధపు ఆనవాలు అంచైనా చెప్పేది నీకు నాగురించి. బాసల వూసులతో నిండిన నాకంటి వెలుగును ర్పేసి నన్ను అంధురాలిని చేసేక నా కళ్ళు ఇక ఏ ప్రణయ కావ్యాలను రచియించగలవు!? అవి ఏదూర తీరాలకో చేరిన సుధా మాధురి స్వరాన్ని వివరించగలవు చెప్పు!?

నేను నేనన్న సామ్యమో సాధనో నిను నిరంతర యాత్రికుడను చేస్తుందేమో కాని ప్రేమ అన్న పదమే ఆ మార్గంలో గమ్యాన్ని చూపించే సాధనం. నేను నేనన్నావు నీ ప్రేమ గొప్పన్నావు.. నీ తోడు గా నడిచే నీ నీడ నల్లదనాన్ని వక్రించావు. అందులోని చల్లదనాన్ని నిరసించావు. మళ్ళీ ఈ రోజు గొప్పదైన నీ తర్కంతో వెలకట్టిన అనుబంధాల విలువలను వెనక్కు తిరిగి అడుగుతున్నావు. వదిలిన చోటనే వెతికే నా వెర్రి నేస్తమా, సాయం సమయపు నీ నీడ ధీర్ఘమై మునిమాపు వేళ గోధూళి ఛాయల మిళితమై పోయింది చూడు..

అద్భుతాలను అనుభవాలను త్వరితంగా మారే లోక ప్రమాణాలతో లెక్కకట్టే నీ మిత్రుల సాహిత్య గుభాళింపుల వనాలలో, ఈ గరిక పువ్వు పూచే అద్భుతం.!ఈ కొండమల్లెకు పట్టిన పరిమళం ఆఘ్రాణింపుకు రావులే.... వదిలెయ్...!!

మూసుకు పోయిన ప్రేమ రహదారుల వెంబడి సాగుతున్న వొంటరి పాంధుడు తన అడుగుల కింద నలిగి ధూళిలో కలిసిన చెలి హృదయపు ఆనవాలు తెలుసుకుని గురుతు వెతికి వచ్చినా, మరణించిన ప్రేమ తోటలోకి రాని వసంతాల వలపు పాట పునర్జీవన రాగాలతో కలిపి ఆలపించినా, అనంత వాయులీనాలలో లీనమైన ఆత్మ అంతు చిక్కని ఆవలి అంచుకు ఆవలకు చేరుకున్న క్షణం వెనక్కి తిప్పి జీవధార తో నింప గలదా!? ఆశక్తి కృష్ణయ్య ప్రేమకు వున్నా అందుకునే ఆసక్తి ఈ రాధమ్మకు వుందా.....!!??